



# స్పిరిట్ లేని కథ

సుమన్

'నమస్కారం గురువుగారో' అన్నాడు శిష్యుడు నమస్కారం పెట్టకుండానే.

గురువుగారు కండువా పరుచుకొని పద్మాసనం వేయబోయి మరిచిపోయి శీర్షాసనం వేసి ఎదురుగావున్న శిష్యుడు తలక్రిందుగా కళ్లజప్పలో కనపడేసరికి తన తప్పుని తెలుసుకొని నాలుక్కొరుక్కొని మళ్లా పద్మాసనం వేసుక్కూర్చొని—

'శిష్యా ఇవ్వాళ నీకు కథలు గురించి చెప్తాను,' అన్నాడు.

శిష్యుడు గబ గబా జేబులోనుంచి మడత పెట్టిన కాగితాన్ని తీసి వెనక జేబులోనుంచి పెన్సిల్ తీసి 'చెప్పండి గురూగారూ! యివ్వాళంతా ఋణపడి వుంటాను. ఎన్నాళ్ల నుంచో ఈ విషయమే అడగాలనుకొంటున్నాను తమ నోటిమీదుగానే అనేశారు' అన్నాడు భక్తి చూపించుతూ.

గురువుగారు ఒళ్ళంతా నవ్వేశారు నవ్వు గురూగారి శరీరంమీద ప్రతిచోటా కనపడింది. శిష్యుడు గురువుగారి నోటివంక ఆశ్చర్యంగా, ఆదుర్దాగా చూశాడు. గురువుగారు చెప్పటం మొదలుపెట్టేడు.

'ఇప్పుడు కథలు చాలమంది రాస్తున్నారు. చాల కథలు రాస్తున్నారు. చాల శైలులలో రాస్తున్నారు. సహకార కథలు కార్మాగారాలు, సహకార కథల స్టోర్సులు వెలిశాయి. వీక్లీలు, మంత్లీలు, అటూ యిటూ చెందని పక్షాలు — యిలా ఎన్నో పత్రికలు కథల్తోనే తనువొళ్ళు కప్పుకొంటున్నాయి. బాగానే వుంది. కాని ఎక్కువ కథల్లో స్పిరిట్ వుండటంలేదు. కథల్లో స్పిరిట్ వుండాలి. స్పిరిట్ లేని కథ చదివినట్టుండదు. అది అసలు కథే కాదు. చివరకు కాకరకాయ కూడ కాదు. ఆ కథ కంచి వెళ్ళబోయి రామేశ్వరం వెళ్తుంది. కాబట్టి కథల్లో స్పిరిట్ వుండాలి

స్ప్రిరిట్' అన్నాడు గురువుగారు. చివరిసారి గట్టిగా అని పొడుం ఓ పట్టు పట్టారు.

'అంటే ఏమిటి స్వామీ' అన్నాడు శిష్యుడు.

గురువుగారికి మాట తడబడింది. ఏదో అనబోతే పెదవులు కదల్లేదు. అటూ యిటూ బెదురు చూపులు చూసి మళ్ళా పొడుం ఓ పట్టు పట్టి 'అదే అదే' అన్నారు.

'అంటే వివరంగా చెప్పండి గురూగారో' అన్నాడు శిష్యుడు వినయంగా వంగి. ఇక గురువుగారికి చెప్పక తప్పలేదు.

'స్పిరిట్ అంటే స్పిరిటే. దానికి రంగూ, రుచీ, వాసనా యిత్యాదులు వుండవు. లేకపోయినా వున్నట్లే వుంటుంది. కంటికి కనపడకపోయినా చూడొచ్చు. నువ్వు కాబోయే కథకుడివి గనక అనుభవం మీద సంపాదించు' అన్నాడు గురువు.

సంపాదించటానికి బయలుదేరాడు శిష్యుడు. ఎన్నో నదీతీరాలూ, సముద్రపు టొడ్డులు, కాలేజీలు, కాలేజీలు, మార్కెట్లు, రోడ్లు, చిల్లర దుకాణాలు — అన్నీ తిరిగి చివరకు ఓ బోర్డు దగ్గర ఆగిపోయాడు. బోర్డులో తెల్లటి రంగులో ఎర్రటి అక్షరాలతో 'ఇచట అన్నిరకాల స్పిరిట్లు అమ్మబడును' అని రాసివుంది.

శిష్యుడు ఆశ్చర్యపోయాడు. గురువుగారు స్పిరిట్ ఒకటే అన్నాడు. ఎన్నో రకాలు వుంటాయనలేదు. మరి వీడు 'అన్నిరకాల'

# స్పిరిట్ లేని కథ

అని రాశాడు. ఇందులో ఏదో మిస్టరీ వుంది. గురువుగారికి అసలు తెలియదా? తెలిసి చెప్పలేదా? ఒకవేళ అన్నీ చెప్తే గురువుని మించిన శిష్యుడ్ని అయిపోతానని భయపడిపోయివుంటాడు...హ్హా...హ్హా...హ్హా' అని ఓ మాయలఫకీరు నవ్వు నవ్వి షాపులోకి వెళ్ళి 'స్పిరిట్' కావాలి' అన్నాడు.

'ఏం స్పిరిట్ సార్, డినేచర్డా, మెడికేటెడా, వేపర్డా, పెరేప్యూమ్డా? — ఏది కావాలి సార్' అన్నాడు షాపువాడు. బోర్డు దగ్గర వెయ్యవలసిన తెల్లముఖం యిక్కడ వేసి తేరుకొని 'అదేనయ్యా కథలకు కావాల్సిన స్పిరిట్' అన్నాడు.


ఈసారి షాపువాడు తెల్లముఖం వేశాడు. చాలసేపు ఆలోచించి బుర్ర గోక్కొని 'ఇక్కడ అటువంటివేమీ వుండవు సార్' అన్నాడు బాధగా బేరం పోయినందుకు.

రోడ్డు మీద పడ్డ శిష్యుడికి అంతా అయోమయంగా వుంది. ఏమి చేయాలో తోచటంలేదు. ఆ స్పిరిట్ ఏమిటో ఎక్కడ దొరుకుతుందో అంతు బట్టటం లేదు. 'అనుభవం మీద సంపాదించు' అని గురువు ఆజ్ఞ. అనుభవం ఎలా వస్తుంది? తిరగటంవలన. తిరక్క బోల్డుమంది ఈ దేశంలో చెడిపోయారు. మగాడు బాగుపడటానికి తిరుగుతాడు. ఆడది చెడాలనుకొని తిరుగుతుంది. అంచేత అనుభవించటానికి నేను తిరగాల్సిందే.' అని ఎన్నోరోజులు పగలనక, రాత్రనక, ఎండనక, తెగతిరిగాడు. కంటికి నిద్రలేదు. నోటికి తిండిలేదు, స్పిరిట్‌ని సాధించనిదే వెళ్ళకూడదనుకొన్నాడు. చిక్కాడు; శల్యం అయ్యాడు, గుడ్డలు చిరిగాయి. గెడ్డం మోకాళ్ళదాక పెరిగింది.

ఒకరోజు హఠాత్తుగా ఓ వ్యక్తి, ఆ గెడ్డాన్ని పట్టుకొని గుంజి వీలేసి 'ఆరి నువ్వటా సుబ్బి — సన్యాసుల్లో ఎప్పుడు కలిసిపోయావు?' అన్నాడు. శిష్యుడు సుబ్బికి తలకొట్టేసినంతపనయింది. అతగాడు చిన్ననాటి స్నేహితుడు. ఒక్కొక్కక్లాసే ఎన్నోఏళ్ళు చదివి ఐదుసార్లు తండ్రి అయ్యేనాటికి ఆ కాలేజీలో యింకా చదవ్వలసినవి రెండు క్లాసులుండటంవలన మానేసి ఎక్కడికో వెళ్ళిపోయాడు. ఆ స్నేహితుడ్ని చూస్తే శిష్యుడికి కొంచం ధైర్యంవచ్చింది. సాయం చేస్తాడని నమ్మకం ఏర్పడింది అందుకని. వాడేమన్నా కోపగించుకోకూడదని కోపాన్ని వాయిదా వేశాడు.

'ఒరేయ్ నాకు స్పిరిట్ కావాలిరా' అన్నాడు చేతులు పట్టుకొని. స్నేహితుడు అనుమానంగా చూశాడు.

'బాబ్బాబూ—యివి చేతులుకావు. నీకు పుణ్యం వుంటుంది. ఇక నాకు తిరిగే ఓపిక లేదు. ఆ స్పిరిట్ ఏదో యింత గొంతులో పోయి' అని బతిమాలుకొన్నాడు. ఈసారి స్నేహితుడు పగలబడి నవ్వి 'ఒరేయ్



మామూలు మనుషులకు ఏదైనా పని చేస్తుంది. కాని సన్యాసుల్లో కల్సిన తర్వాత ముడివదార్థాలు తప్ప పనిచేయవు. నువ్వు ఇంతగా బాగుపడతావని నువ్వు పరీక్ష పాసైనపుడుకూడ అనుకోలేదు. నా వెంట రా.' అన్నాడు.

శిష్యుడు పెంపుడుకుక్కలా వెంటబడ్డాడు. కొంచెంసేపటితర్వాత శిష్యుడు, స్నేహితుడు బాదుగావున్న 'బార్'లో కూర్చొన్నారు మధ్య టేబిల్‌మీాద రెండు మూాడుగ్లాసులు ఒక సీసా వున్నాయి. సీసాలోది గ్లాసులోకి వంచి 'ఇక కొట్టేయ్' అన్నాడు స్నేహితుడు

'ఇదేమిటి' అన్నాడు శిష్యుడు.

'స్పిరిట్ అంటే యిదేనోయ్ ఆలస్యం చేయక.'

'మరి స్పిరిట్ కనపడదే.'

'అదంతే కనపడదు. ఇందులో కల్సి వుంటుంది. దానికి రంగు, వాసనా వుండదు. వుంటుంది. కానికనపడదు. ఇక కొట్టేయ్'.


శిష్యుడికి బోల్డు సంతోషం కల్గింది. సరిగ్గా గురువుగారు యిదే మాటలు చెప్పాడు. కాబట్టి ఇందులో నిజంవుంది. ఇదే నిజమైన 'స్పిరిట్' అని గబగబ గ్లాసు గటగట తాగేసేడు. తర్వాత శిష్యుడు స్నేహితుడ్ని పంచరంగుల్లో చూశాడు. బూతులు తిట్టాడు. గ్లాసులు పగలగొట్టాడు. టేబిల్‌ని తిరగబెట్టాడు. సర్వర్ని కొట్టాడు. బార్ వాడిచేత తిట్లు తిన్నాడు. చేతులతో పాకుతూ బయటకు నడిచాడు, శిష్యుడ్ని చూసి స్నేహితుడు పశ్చాత్తాపపడి, ఆ పశ్చాత్తాపంలో మరో రెండు గ్లాసులు వేసి స్నేహితుడ్ని ఇంటికిచేర్చి 'ఇపుడు నీకు స్పిరిట్ బాగా వస్తోంది, రాసుకో పో' అని తను పోయాడు.

స్పిరిట్ అనగానే శిష్యుడికి ఒళ్ళు గగుర్పొడిచి గబగబ కాగితాలు తీసి ఏవేవో వ్రాశాడు, కొన్నాళ్ళకది 'మ్యాగజైన్'లంటి 'మాగజైనులో'పడింది. దానిని చదివి బోల్డు మంది బాగా రాశాడన్నారు. మెచ్చుకొన్నారు. ఇంకా చాలామంది 'ఈ కథ చదివితే తాగక్కర్లేదన్నారు.' ఇది గొప్ప ఎక్స్‌పెరిమెంట్ అన్నారు కొంతమంది.

ఈ వచ్చిన పేరుకి శిష్యుడి చాలా సంతోషించాడు. గర్వంగా తిరిగాడు. [illegible] పంగనామాలు పెట్టేశాడు.

తర్వాత శిష్యుడు కథలు ఎప్పుడు రాయనూ లేదు, తాగటం మానడమూ లేదు.

పిల్లలు - ఆరోగ్యము



# మొదటి మూడు సంవత్సరాలు జీవితంలో అతిముఖ్యమైనవి!

డాక్టర్ కె వెంకటేశ్వరరావు

మనదేశంలో ప్రతి వెయ్యి ప్రసవాలకి నలభై మంది పిల్లలు ఒక సంవత్సరం నిండకుండా చనిపోవడం జరుగుతున్నది. పిల్లలకి పోషణ సరిగా లేకపోవటమే దీనికి ముఖ్యకారణం.

అంటువ్యాధుల వల్ల చాలా మంది పిల్లలు ప్రాణాలు కోల్పోకపోయినా తాత్కాలికమో, నిరంతరమో అయిన శారీరక బాధలకి గురి అవుతున్నారు.

ఈ మొదటి మూడు సంవత్సరాలలోనే ప్రతి మనిషికీ మెదడు పూర్తిగా పెరుగుతుంది. ఈ కాలంలో పిల్లలకి సరైన పోషణ లేకపోవటం వల్ల వారి గ్రహణశక్తి లోపించడం, మానసికమైన దౌర్బల్యానికి గురి కావటం జరుగుతుంది. ఈ వయసులో వారికి సరైన పోషణ ఉండేలా చూడటం పెద్దల ముఖ్య కర్తవ్యం.

మొదటి మూడేళ్ళలోనే వాంతులు, విరోచనాలు పిల్లలకి రావడానికి ఎక్కువ అవకాశం ఉంది. వాంతులు, విరోచనాలు ఎక్కువగా అవుతున్నప్పుడు వెంటనే వైద్యుని సహాయం పొందాలి. అలా తక్షణ వైద్య సహాయం చేయించనందు వల్ల చాలా మంది పిల్లలు చనిపోవడం జరుగుతున్నది.

ఈ వయసులో పిల్లలు ఒకచోట నిలకడగా ఉండరు. కుంపట్ల మీాద మరుగుతున్న నీళ్ళని మొదలైన వాటిని మీాద పోసుకోడం, రోడ్ల మీాదికి పరిగెత్తి ప్రమాదాల పాలు కావటం, మెట్లు ఎక్కి అక్కడ్నించి పడి ఆపదకి గురి కావటం, కొన్ని సందర్భాలలో ప్రాణాపాయం సంభవించడం జరుగుతున్నది. కాబట్టి పిల్లలు ప్రమాదకరమైన ప్రదేశాలకి వెళ్ళకుండా, మెట్లు మొదలైనవి ఎక్కకుండా పెద్దలు జాగ్రత్త తీసుకోవాలి.

పిల్లలకి మూడు సంవత్సరాలు నిండే వరకూ ఈ ప్రమాదాల నించి వారిని కాపాడితే శిశు మరణాలని చాలా వరకూ తగ్గించవచ్చు.

## డాక్టరు వద్దకి వెళేటప్పుడు గుర్తుంచుకోవలసిన ముఖ్య విషయాలు :

1. పాప పుట్టినప్పటి బరువు. 2. పూర్తిగా నెలలు నిండిన తర్వాత పుట్టినదా లేక ముందే పుట్టిందా? 3. పాప పుట్టగానే బాగా ఏడ్చిందా? 4. పుట్టినప్పుడు బిడ్డ నీలం రంగుగా ఉందా లేక మామూలుగా ఉన్నదా? 5. మామూలు ప్రసవమా లేక ఆయుధాన్ని ఉపయోగించడంగానీ, ఆపరేషన్‌గానీ జరిగిందా? 6. పుట్టినప్పటినుంచి బిడ్డకి యిచ్చిన ఆహారం. 7. వ్యాధి నిరోధక ఔషధాలు, ఇంజక్షన్లు యిచ్చిన వివరాలు. 8. పుట్టినప్పటి నుంచి బిడ్డకి వాడిన మందులు వగయిరాల వివరాలు. 9. ఫిట్స్ మొదలైనవి వచ్చి ఉంటే అవి మొదలైన వయస్సు, వచ్చినప్పుడు ఎంత సేపు ఉంటాయన్నది, వచ్చిన తర్వాత పిల్లల మానసిక ప్రవృత్తి ఎలా ఉంది? అన్న విషయాలు. 10. వాంతులు విరోచనాలు, అవుతుంటే అవి మొదలైనప్పటి నుంచి వాడిన, వాడుతున్న మందులు వగయిరాల వివరాలు.

ఈ విషయాలన్నీ పిల్లలని డాక్టరు దగ్గరకి తీసి కెళ్ళేటప్పుడు ప్రతివారూ ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.